ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

బాపట్ల జిల్లా వార్తలు

5

ఆదివారం 13 జూలై 2025





కలెక్టర్ జె.వెంకటమురళి

పొగాకు కొనుగోళ్లు వేగవంతం

- కొత్తగా 12 కొనుగోలు కేంద్రాలు ప్రారంభం
- ప్రైవేట్ వ్యక్తులు విక్రయిస్తే క్రిమినల్ చర్యలు
- అధికారులను ఆదేశించిన కలెక్టర్ వెంకటమురళి

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు రైతులు నిరుత్సాహ పడకుండా కొనుగోళ్లను వేగవంతం చేయాలని కలెక్టర్ వెంకటమురళి అధికారులను ఆదేశించారు. కొనుగోళ్లపై శనివారం కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. రైతులు అపోహలకు లోనుకాకూడదని, సరైన సమాచారం కోసం మండల, జిల్లా స్థాయి అధికారులను సంప్రదించాలన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో ఆరు కొనుగోలు కేంద్రాలు అందుబాటులో ఉండగా 14న చిన్నగంజాం, మార్టూరు, అడుసుమల్లి, 16న సంతమాగులూరు, తమ్మవరంలో ఒక్కోటి చొప్పున ఐదు కొనుగోలు కేంద్రాలను కొత్తగా ప్రారంభిస్తామన్నారు. ఆపై వారంలో మరో 7 కేంద్రాలను ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. కొనుగోలు కేంద్రాల్లో స్టాక్ నిల్వ సమస్యలు తలెత్తకుండా తగిన గిడ్డంగులు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. కొనుగోలు కేంద్రాల్లో 24 గంటల భద్రతకు సీసీకెమెరాల ఏర్పాటుతోపాటు రెవెన్యూ, పోలీసు పర్యవేక్షణ తప్పనిసరి అని తెలిపారు. రైతుల నుంచి ప్రైవేట్ వ్యక్తులు పొగాకు కొనుగోలు చేసి ప్రభుత్వానికి విక్రయిస్తే క్రిమినల్ చర్యలు తప్పవన్నారు. అలాంటి చర్యలకు పాల్పడే అధికారులపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. టెలీకాన్ఫరెన్స్‌లో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు, మార్క్‌ఫెడ్ డీఎమ్ కరుణశ్రీ, జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ, మార్కెటింగ్‌శాఖ ఏడీ రమేష్, ఆర్డీవోలు పి.గ్లోరియా, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జమలో.. జాప్యం

గతంలో ఎన్నడూ లేనివిధంగా బర్లీ పొగాకును మార్క్‌ఫెడ్ ద్వారా ప్రభుత్వం కొంటున్నది. ఇంతవరకు బాగానే ఉన్నా ఖాతాల్లో నగదు జమ కాకపోవడంతో రైతుల్లో ఆగ్రహం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం రంగంలోకి దిగి పొగాకును కొనడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నా డబ్బుల జమ విషయంలో జాప్యం జరుగుతుండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పర్చూరు మార్కెట్‌యార్డులో కొనుగోలు కేంద్రం వద్ద రైతుల రద్దీ (ఫైల్ ఫొటో)



- బర్లీ రైతులకు రూ.29 కోట్లు బకాయి
- గత నెల 19 నుంచి మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు
- ఆర్థికశాఖ అనుమతులు పెండింగ్‌తో రైతుల ఎదురుచూపు

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

బాపట్ల, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో జూన్ 19 నుంచి బర్లీ పొగాకు కొనుగోలు కేంద్రాలను ప్రత్యేకంగా మార్క్‌ఫెడ్ ప్రారంభించింది. ఇప్పటి వరకు 2,600 టన్నుల పొగాకును రైతుల నుంచి సేకరించింది. ఇందుకు సంబంధించి బాపట్ల జిల్లాలో 680 మంది, పల్నాడు, గుంటూరు, ప్రకాశం జిల్లాల పరిధిలో 453 మంది రైతులకు మార్క్‌ఫెడ్ సుమారు రూ.29 కోట్లు చెల్లించాల్సి ఉంది. కానీ నగదు జమ విషయంలో రైతులకు మూడు వారాలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. బర్లీ పొగాకు కొనుగోళ్ల కోసంగా ప్రభుత్వం రూ.273.17 కోట్లను కేటాయించగా తక్షణమే రూ.100 కోట్లు విడుదలకు మంత్రివర్గం జూన్ 25న పచ్చజెండా ఊపింది. ఈ ప్రకటన తర్వాత తమ ఖాతాల్లో డబ్బులు వెంటనే పడతాయని పొగాకు రైతులు ఆశలు పెట్టుకున్నారు. కానీ ఆర్థిక శాఖ నుంచి అనుమతులకు క్లియరెన్స్ లభించకపోవడంతో రైతుల ఖాతాల్లో నగదు జమలో జాప్యం జరుగుతుందని మార్క్‌ఫెడ్ అధికారులు చెబుతున్నారు. మరో వారం రోజుల్లో రైతుల ఖాతాల్లో నగదు జమవుతాయని చెబుతున్నా రైతుల్లో మాత్రం గందరగోళం నెలకొంది

అదనంగా మరికొన్ని కేంద్రాలు..

బాపట్ల, పల్నాడు, గుంటూరు జిల్లాల్లో బర్లీ పొగాకును జూన్ 19 నుంచి మార్క్‌ఫెడ్ కొనడం ప్రారంభించింది. ఈ క్రాప్ చిక్కులతో పాటు ఫోన్ మెసేజ్‌లపై రైతులకు అవగాహన లేకపోవడంతో ఆరంభంలో ఓ వారం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి. సాంకేతిక చిక్కులు కొలిక్కి రావడంతో పాటు రైతులకు నిర్దేశించిన సమయంలోనే ఫోన్ మెసేజ్ ఆధారంగా పొగాకును కేంద్రాలకు తీసుకువస్తుండడంతో కొనుగోళ్లు గాడిన పడ్డాయి. ఇప్పటి వరకు 2,600 టన్నులను మార్క్‌ఫెడ్ సేకరించింది. అయితే కొనుగోళ్ల కేంద్రాల వద్ద రద్దీ పెరగడంతో అదనంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలనే డిమాండ్లు రైతుల నుంచి పెద్దఎత్తున వస్తున్నాయి. ఈ విషయాన్ని బర్లీ రైతులు ఇటీవల పంగలూరులో మంత్రి గొట్టిపాటి రవికుమార్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో అదనంగా మరి కొన్ని కొనుగోలు కేంద్రాలను మార్క్‌ఫెడ్ సోమవారం ప్రారంభించనున్నది.

రెండు నెలల పాటు కొనుగోలు కేంద్రాలు

ఈ సీజన్‌లో కంపెనీలు దాదాపు 2600 టన్నుల పొగాకు కొనుగోలు చేసినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. నాలుగు జిల్లాల పరిధిలో రైతుల వద్ద ఇంకా దాదాపు 35,000 టన్నుల పొగాకు నిల్వ ఉన్నట్లు యంత్రాంగం చేపట్టిన క్షేత్రస్థాయి సర్వేలో తేలింది. సగటున రోజుకు 600 టన్నుల పొగాకు కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినా ఇంకా రెండు నెలల పాటు మార్క్‌ఫెడ్ కొనుగోళ్లు చేపట్టాల్సి ఉంది.

ముళ్లచెట్లు తొలగింపు..

పార్కుకు ప్రతిపాదనలు

- సుందరవనంలో కంపోస్ట్ యూనిట్ ఆలోచన విరమణ
- ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన మున్సిపల్ అధికారులు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డు సమీపంలో మున్సిపల్ స్థలంలో మొక్కలు నాటి సుందరవనంలా మార్చాలని తొలుత ప్రయత్నించిన అధికారులు మధ్యలో విస్మరించారు. చివరకు ఆ ప్రాంతంలోని హైవే పక్కనే ఉన్న ఎకరం 9 సెంట్ల భూమిని ముళ్ల చెట్లతో చిట్టడవిలా మార్చేశారు. ఇక్కడ వర్మికంపోస్టు యూనిట్ స్థాపనకు ప్రయత్నించారు. ఈ క్రమంలో 'మొక్కలు నాటారు.. సంరక్షణ మరిచారు.. ముళ్ళచెట్లతో చిట్టడవిని తలిపిస్తున్న సుందరవనం' అంటూ ఆంధ్రజ్యోతిలో వెలువడిన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. గత ప్రభుత్వ హయాంలో అప్పటి జిల్లా అధికారులు మున్సిపల్ స్థలాన్ని తీసుకుని మొక్కలు నాటారు. ఆ తర్వాత వాటిని సంరక్షించకుండా వదిలేశారు. దీంతో ఆప్రాంతంలో మంతా పిచ్చిమొక్కలు, ముళ్లచెట్లు పెరిగి సుందరవనం చిట్టడవిగా మారింది. ఈ క్రమంలో జిల్లా అధికారుల ఆదేశాలతో ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలను మున్సిపల్ అధికారులు తొలిగించి శుభ్రం చేయించారు. ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ సూచనల మేరకు ఇక్కడ పార్క్, వాకింగ్‌ట్రాక్ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ గ్రీన్ కార్పొరేషన్‌కు ప్రతిపాదనలు పంపించినట్లు కమిషనర్ రఘునాథరెడ్డి తెలిపారు. రూ.25 లక్షలు వెచ్చించి ఆహ్లాదకరమైన పార్కును ఏర్పాటు చేస్తామని చెప్పారు. వర్మికం పోస్ట్ యూనిట్ ఏర్పాటు చేయాలనే ఆలోచన విరమించుకున్నామన్నారు.



శుభ్రం చేయక ముందు ముళ్లచెట్లు, పిచ్చిమొక్కలతో ఉన్న ప్రాంతం



వ్యవసాయ మార్కెట్ యార్డు ఎదుట చిట్టడవిని తలపిస్తున్న ప్రాంతాన్ని శుభ్రం చేస్తున్న ఎక్స్‌కవేటర్



జగనన్న మహిళా మార్ట్(ఫైల్ ఫొటో)

మెప్మా గాడిన పడేదెప్పుడో..

- ఏడాదిగా మహిళా మార్ట్ మూత
- ఇప్పటికీ సభ్యులకు పంచని వాటా ధనం
- సభ్యులకు తెలియకుండా రుణాలు పొందిన ఆర్పీలు
- విచారణ చేస్తే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం

అద్దంకి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత మెప్మా గాడిలో పడుతుందని భావించిన సభ్యులకు ఏడాదిగా నిరాశే మిగిలింది. అద్దంకిలో గతంలో ఏర్పాటు చేసిన జగనన్న మహిళా మార్ట్ మూత పడినా తమ వాటా ధనం కోసం ఏడాదిగా ఎదురుచూస్తున్నారు. 2022 ఫిబ్రవరి 3న అద్దంకిలో సుమారు 8 వేల మంది స్వయం సహాయక సంఘాల సభ్యుల నుంచి రూ.12 లక్షలు వసూలు చేసి జగనన్న మహిళా మార్ట్ ప్రారంభించారు. ఈ మార్ట్‌లో ఏటా వచ్చే ఆదాయాన్ని సభ్యులకు పంపిణీ చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చారు. సుమారు 28 నెలలు మార్ట్ నిర్వహించారు. పెట్టుబడి పెట్టిన సభ్యులతోనే బలవంతంగా నిత్యావసర సరుకులను అధిక ధరలకు కొనుగోలు చేయించారు. వైసీపీ ప్రభుత్వం చివరలో మార్ట్ నిర్వహణ చూసే మెప్మా సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరించి పెట్టుబడి నిధిని సొంత అవసరాలకు వినియోగించుకున్నారు. దీనిగురించి మెప్మా సభ్యులు ప్రశ్నించినా అప్పట్లో సమాధానం చెప్పలేదు. దీంతో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సభ్యులు మార్ట్‌లో అవినీతిపై మంత్రి రవికుమార్‌కు ఫిర్యాదు చేయగా విచారణకు ఆదేశించారు. మార్ట్‌లో లాభాలు చూపించకపోగా పెట్టుబడి నిధిలోనే నష్టాలు చూపించినట్లు విచారణ అధికారులు తేల్చారని సమాచారం. విచారణ జరిగి ఏడాది గడిచినా సభ్యులకు న్యాయం జరగలేదు. లాభాలు అటుంచి కనీసం పెట్టుబడి నిధి అయినా చెల్లించాలని సభ్యులు కోరుతున్నారు.

బ్యాంకు రుణాలు ఎగనామం..

మహిళా మార్ట్ పరిస్థితి ఈ విధంగా ఉంటే తమకు తెలియ కుండా తమ స్వయం సహాయక సంఘం పేరుతో బ్యాంక్‌లో ఆర్పీలు రుణం తీసుకుని నెలవారీ కిస్తీలు చెల్లించకుండా ఎగనామం పెడుతున్నట్లు పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. గతంలో తీసుకున్న రుణం చెల్లించాము.. మళ్లీ రుణం ఇవ్వాలని ఓ స్వయం సహాయక సంఘ సభ్యులు బ్యాంక్‌కు వెళ్లగా బకాయి ఉన్నట్లు అధికారులు తెలిపారు. దీంతో వారు నిలదీ యగా తప్పు ఒప్పుకుని విడతల వారీగా చెల్లించేందుకు ఆర్పీ అంగీకరించింది. అయితే నగదు చెల్లించకపోవడంతో ఆర్పీపై పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వారు సిద్ధమైనట్లు తెలుస్తుంది. మరికొన్ని గ్రూపుల సభ్యులను ఏమార్చి ఆర్పీలు రుణాలు తీసుకున్నట్లు సమాచారం. మరికొందరు ఆర్పీలు డమ్మీ గ్రూపులను నిర్వహిస్తూ బ్యాంకుల నుంచి రుణాలు పొందినట్లు ఆరోపణలున్నాయి. సమగ్ర విచారణ జరిపితే మెప్మాలో మరెన్నో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని స్వయం సహాయక సంఘాల సభ్యులు చెప్తున్నారు.

గుడ్డు భోజనంతోనూ..

శిల్క్‌వ్యాపారి టోకరా

వెలుగు చూస్తున్న ఘరానా మోసగాడి లీలలు



రూ.49లకే గుడ్డు భోజనం అంటూ పర్చూరులో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

పర్చూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): అధిక వడ్డీ ఆశచూపి పలువురిని ఆర్థికంగా దెబ్బతీసిన శిల్క్‌వ్యాపారి ఘరానా మోసాలు వెలుగుచూస్తున్నాయి. కొద్ది నెలల ముందు పోలీసు స్టేషన్‌కు సమీపంలోనే రూ.49కే గుడ్డు భోజ నంతో హోటల్ ప్రారంభించి మరి కొందరిని బురిడీ కొట్టించి అందిన కాడికి సొమ్ము చేసుకున్నాడని సమాచారం. రూ.49కే పలావు, కోడిగుడ్డు(భోజనం) అంటూ బోర్డుపెట్టాడు. వంటకాలు రుచికరంగా ఉండడం, ధర తక్కువ కావ డంతో జనాలు ఎగబడ్డారు. అప్ప టికే శిల్క్ చీరలను తక్కువ ధరకు ఇస్తుండటం, రూ.49కి గుడ్డుభోజనానికి ఆదరణ లభించడంతో అతడిపై ప్రజల్లో నమ్మకం మరింత పెరిగింది. ఈ క్రమంలోనే తాను రుణం కోసం దరఖాస్తు చేశానని కొద్దిరోజుల్లో డబ్బులు వస్తాయని చెప్పి డబ్బులు తీసుకున్నట్లు బాధితులు చెబుతున్నారు. అతడికి డబ్బులు ఇచ్చినట్లు ఆధారాలు లేకపోవడం, ఏమిచే యాలో అర్థం కాక బాధితులు లబోదిబో మంటున్నారు. మోసగాడి గుట్టు బహిర్గతం కావడంతో పోలీసు అధికారులు సదరు నిం దితుడి వ్యవహారంపై దృష్టిసారించారు. ఘరానా మోసగాడితో సన్నిహితంగా ఉన్న తమ శాఖలోని వారి వివరాలు తెలుసుకునే ప్రయత్నంలో అధికారులు ఉన్నారు. ప్రస్తుతం పర్చూరులో మోసగాడి బాగోతం, బాధితుల ఆరణ్య వేదన చర్చనీయాంశంగా మారింది. ఈ మోసగాడికి నగదు ఇచ్చిన వారిలో పేదలే ఎక్కువమంది ఉన్నారు. బ్యాంకులో డ్వాక్రా రుణం తీసుకుని ఎక్కువ వడ్డీ ఆశతో మోస గాడికి ఇవ్వగా అతడు ప్రస్తుతం పరారీలో ఉండటంతో డ్వాక్రా మహిళలు కన్నీటి పర్యంతమ వుతున్నారు.

బతుకు భారమై

అమ్మ ఆత్మహత్య

- కన్నబిడ్డలపైనా.. పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం
- పరుగులు తీయడంతో తప్పించుకున్న చిన్నారులు
- అప్పుల భారంతో భర్త బలవన్మరణం
- సంవత్సరికం రోజే విషాదం

7

నేటి నుంచి ఇంజనీరింగ్

వెబ్ కౌన్సెలింగ్

- ఉమ్మడి జిల్లాలో మూడు సహాయక కేంద్రాలు
- జాగ్రత్తలు పాటించాలంటున్న అధ్యాపకులు



పుర కార్మికులు.. పోరుబాట

- మున్సిపల్ కమిషనర్లకు సమ్మె నోటీసు
- నేటి నుంచి సమ్మెలోకి కాంట్రాక్ట్ కార్మికులు
- 16 నుంచి పారిశుధ్య కార్మికుల నిరవధిక సమ్మె



బాపట్ల : ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ఇవీ కార్మికుల డిమాండ్లు..

మున్సిపాల్టీలోని వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు డిమాండ్లు ఇలా ఉన్నాయి.

- సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి. జీవో 36 ప్రకారం జీతాలు రూ.21,000 నుంచి రూ.24,500లకు పెంచాలి.
- ఇంజనీరింగ్ కార్మికులను టెక్నికల్, నాన్ టెక్నికల్‌గా విభజించి జీతాలు చెల్లించాలి.
- గత 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలు అమలు చేయాలి.
- ఉద్యోగ విరమణ ప్రయోజనాలు పెంచాలి.
- తల్లికి వందనం తదితర ప్రభుత్వ పథకాలు అమలు చేయాలి.
- ఆప్కాస్‌ను రద్దు చేసి పర్మినెంట్ చేయాలి.
- వయోపరిమితిని 62 ఏళ్లకు పెంచాలి.

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

నేతలకు, అధికారులకు వినతిపత్రాలు.. వివిధ రూపాల్లో ఇప్పటి వరకు ప్రదర్శనలు, దర్నాలతో నిరసన తెలిపిన మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికులు నిరవధికంగా పోరుబాటకు సిద్ధమయ్యారు. పురపాలక సంఘాల్లోని వివిధ విభాగాల కాంట్రాక్టు కార్మికులు ఆదివారం నుంచి నిరవధిక సమ్మె చేపట్టనున్నారు. ఈ మేరకు మున్సిపాల్టీల్లో కమిషనర్లకు నోటీసులు కూడా అందజేశారు. సమస్యల పరిష్కారం కోసం అనేక రూపాల్లో ప్రభుత్వానికి విన్నవించినా పరిష్కారం కాని పక్షంలో నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు కార్మిక సంఘాల నేతలు తెలిపారు. జిల్లాలోని మూడు మున్సిపాల్టీలు, అద్దంకి నగర పంచాయతీలో కార్మికులు సమ్మెలోకి వెళ్లనున్నారు. దీంతో ఆయా మున్సిపాల్టీల్లో ప్రధానంగా తాగునీటి సరఫరాకు ఇబ్బందికర పరిస్థితులు ఎదురవనున్నాయి. ఇంజనీరింగ్, ప్రణాళిక విభాగం, పరిపాలన, నీటి సరఫరా తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులు తొలుత సమ్మె చేపట్టనున్నారు. అప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే ఈ నెల 16 నుంచి పారిశుధ్య కార్మికులు కూడా నిరవధిక సమ్మెకు సమాయత్తమవుతున్నారు. ఈ మేరకు సమ్మె విషయం గురించి సదరు కార్మికులు కమిషనర్లకు తెలిపారు. తమ డిమాండ్లను ప్రభుత్వం అమలు చేసే వరకు సమ్మె కొనసాగిస్తామని కార్మికులు స్పష్టం చేశారు. నరసరావుపేటలో కార్మికులు శనివారం ప్రదర్శన నిర్వహించారు.

అన్నదాతకు.. మేమూ అర్హులమే

- సుఖీభవ పథకానికి భారీగా దరఖాస్తులు
- ఫిర్యాదులకు నేటితో ముగియనున్న గడువు
- జిల్లాలో 4,900 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

రైతులకు పెట్టుబడి సాయం అందించడం కోసం అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో నిధులు జమ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. పీఎం కిసాన్ రూ.2,000, రాష్ట్రం రూ.5,000 కలిపి ఈ నెల 21న అన్నదాత సుఖీభవ పథకం కింద రైతుల ఖాతాల్లో జమ చేయనున్నది. రైతు సేవా కేంద్రాల్లో ముందస్తుగా అర్హులైన లబ్ధిదారుల జాబితాను ప్రదర్శించారు. అర్హత ఉండి జాబితాలో పేరు లేని వారు అన్నదాత సుఖీభవ పోర్టల్‌లోని గ్రీవెన్స్ మాడ్యూల్లో ఫిర్యాదు చేయవచ్చని ప్రభుత్వం సూచించింది. ఇందుకు సంబంధించి గడువు ఆదివారంతో ముగియనున్నది. అర్హత ఉన్నా జాబితాలో తమ పేరు లేదని 1200 మంది రైతులు శనివారం వరకు దరఖాస్తు చేసుకున్నారు. ఆదివారం వరకు గడువు ఉన్నందున ఈ సంఖ్య 1,500 వరకు చేరే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈకేవైసీలో ఎదురవుతున్న సాంకేతిక చిక్కుల వల్ల పెద్ద సంఖ్యలో రైతులు ఈ పథకానికి దూరమయ్యే సూచనలు కనబడుతున్నాయి. మరో 3,400 మంది బయోమెట్రిక్ విషయంలో రైతులు అందుబాటులో లేకపోవడం వంటి కారణాలతో పెండింగ్‌లో ఉన్నాయని వీటిని మరో మూడు రోజుల్లో పూర్తి చేయడానికి అధికారులు కసరత్తు చేస్తున్నారు. 4,900 మంది రైతుల ఈకేవైసీ పెండింగ్‌లో ఉండగా 1,500 మంది రైతుల వేలిముద్రల విషయంలో సాంకేతిక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వేళ్ల మీద ఉన్న రేఖలు చెరిగిపోవడం వంటి తదితర కారణాలతో ఈకేవైసీ జరగడం లేదు. వీరి విషయంలో ఐరిస్ లేదా ఫేస్ రికగ్నేషనే ప్రత్యామ్నాయమని కానీ ఇందుకు సంబంధించి ప్రభుత్వ నిర్ణయమే ఫైనల్ అని అధికారులు చెబుతున్నారు. అన్నదాత సుఖీభవ పథకాన్ని కౌలు రైతులకు అందించడంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో వారు ఎదురు చూస్తున్నారు.

జిల్లాలో 1,57,200 మంది అర్హులు

జిల్లా వ్యాప్తంగా 1,62,200 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి అర్హులుగా వ్యవసాయశాఖ గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేసింది. ఈకేవైసీ తదితర కారణాలతో 5,000 మంది రైతుల పేర్లను ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచింది. దీంతో జిల్లాలో 1,57,200 మంది రైతులను ప్రాథమికంగా అర్హులుగా ప్రభుత్వం తేల్చింది. జాయింట్ ఎల్‌పీఎంల ఇక్కట్ల విషయంలో ప్రభుత్వం వారం రోజుల పాటు స్పెషల్ డ్రైవ్ నిర్వహించడంతో పాటు, చెల్లించాల్సిన రుసుం విషయంలో రాయితీ కల్పించడం వల్ల దాదాపు 4,000 మంది రైతులకు అదనంగా లబ్ధి చేకూరినట్లైంది. జిల్లాలో తామూ అర్హులమేనని 1200 మంది రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి ప్రభుత్వ ఆమోదం కోసం పంపామని అక్కడి నుంచి అనుమతి వస్తే వారు కూడా లబ్ధిదారుల జాబితాలో చేరతారని అధికారులు చెబుతున్నారు. రీ సర్వే శాపం కారణంగా జిల్లాలో దాదాపు 3,500 మంది రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దూరమయినట్లు తెలుస్తోంది.

చిత్రజ్యోతి
★ SINCE 1965 ★

పవర్‌ఫుల్ పాత్రలో



రామ్‌చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతోన్న సినిమా 'పెద్ది'. మైత్రీ మూవీ మేకర్స్ సుకుమార్ రైటింగ్స్ సంస్థల సమర్పణలో వృద్ధి సినిమాస్ బేనర్‌పై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ షాట్ గ్లింప్స్‌తో దేశవ్యాప్తంగా అంచనాలను పెంచేసింది. కన్నడ సూపర్ స్టార్ శివరాజ్ కుమార్ ఈ చిత్రంలో 'గౌర్నాయుడు' అనే పవర్‌ఫుల్ క్యారెక్టర్‌లో కనిపించబోతున్నారు. శనివారం ఆయన పుట్టిన రోజు. ఈ సందర్భంగా శివరాజ్‌కుమార్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ని మేకర్స్ రిలీజ్ చేశారు. కాగా, ఈ సినిమాలో రామ్‌చరణ్ సరసన కథానాయికగా జాన్వీకపూర్ నటిస్తున్నారు. జగపతి బాబు, దివ్యేంద్రు శర్మ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్నారు. వచ్చే ఏడాది మార్చి 27న రామ్‌చరణ్ పుట్టిన రోజు సందర్భంగా సినిమా విడుదల కానుంది.

కథ విని ఉద్వేగానికి లోనయ్యా

- సెంథిల్ కుమార్



'ఒక సినిమా అంగీకరించే ముందు కథలో ప్రేక్షకులను కదిలించే బలమైన భావోద్వేగాలు ఉన్నాయా, లేవా? అని చూస్తాను. 'జూనియర్' సినిమా స్క్రిప్ట్ నాకు బాగా నచ్చింది. కథ విని ఉద్వేగానికి లోనయ్యా. బలమైన భావోద్వేగాలతో పాటు ప్రేమ, కుటుంబ విలువలతో సినిమా ఆద్యంతం హృద్యంగా ఉంటుంది' అని సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్ అన్నారు. గాలి జనార్థన్‌రెడ్డి తనయుడు కిరీటి రెడ్డి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. రాధాకృష్ణ దర్శకత్వంలో రజనీ కొర్రపాటి నిర్మించారు. ఈ నెల 18న 'జూనియర్' విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ అందించిన సెంథిల్ కుమార్ మీడియాతో మాట్లాడారు. 'దర్శకుడు రాధాకృష్ణ చెప్పిన కథ నాకు బాగా నచ్చింది. కొత్త హీరోకు ఇలాంటి సినిమా చేయడం కొంచెం కష్టమే. కానీ కిరీటి ఒక సవాల్‌గా తీసుకొని ఈ సినిమా కోసం కష్టపడిన తీరు నాకు నచ్చింది. ఈ సినిమాలో పాటలతో పాటు కిరీటీ, శ్రీలీల జంట చేసిన డాన్స్‌లను ప్రేక్షకులు బాగా ఎంజాయ్ చేస్తారు. కిరీటి మంచి నటుడు, అద్భుతమైన డాన్సర్. సెట్స్‌లో చాలా కష్టపడ్డాడు. తొలి చిత్రం 'జూనియర్'తోనే ఆయన ప్రేక్షకులను ఆకట్టుకుంటాడనే గట్టి నమ్మకం ఉంది. ఒక మంచి సినిమా అందించాలనే తపనతో నిర్మాతలు ఈ సినిమా తీశారు' అని చెప్పారు.

బ్యూటిఫుల్ మెలోడీ



రష్మిక మందన్న, దీక్షిత్ శెట్టి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతోన్న చిత్రం 'ద గర్ల్‌ఫ్రెండ్'. 'చి ల సౌ'తో జాతీయ అవార్డు అందుకున్న రాహుల్ రవీంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. గీతా ఆర్ట్స్ సమర్పణలో ధీరజ్ మొగిలినేని, విద్య కొప్పినీడి నిర్మిస్తున్నారు. ఇటీవలె విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను పెంచేసింది. ఈ నెల 16న సినిమా నుంచి 'నదివే' అంటూ సాగే పాటను విడుదల చేయనున్నట్లు ప్రకటించారు మేకర్స్. ఈ బ్యూటిఫుల్ మెలోడీకి హేషమ్ అబ్దుల్ వహాబ్ సంగీతం అందించారు. త్వరలోనే సినిమాను ప్రేక్షకుల ముందుకు తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: కృష్ణన్ వసంత్.

యాక్టర్స్‌ని తిట్టాను.. కొట్టాను..

ప్రవీణ పరుచూరి



'మా 'కొత్తపల్లిలో ఒకప్పుడు' సినిమాలో రెండు పాత్రల మధ్య నడిచే సన్నివేశాలు కీలకంగా నిలుస్తాయి. వారి మధ్య వచ్చే సన్నివేశాలు అద్భుతంగా రాకపోతే సినిమా సాదాసీదాగా ఉంటుంది. అందుకే వారి నుంచి మంచి నటన రాబట్టాలనుకున్నాను. సెట్‌లో వారిని తిట్టాను, కొట్టాను, వారిపై రాళ్లు విసిరాను. మనం చేసే పాత్రలో జీవించడమే నటన అని నమ్ముతాను. అందుకే సినిమా కోసం ఏదైనా సరే తప్పదు. అందుకే వారిపట్ల అలా ప్రవర్తించినందుకు క్షమాపణలు చెప్పలేదు' అని దర్శకురాలు ప్రవీణ పరుచూరి చెప్పారు. రానా సమర్పణలో మనోజ్ చంద్ర, మోనికా జంటగా ప్రవీణ తెరకెక్కించిన ఈ చిత్రం ఈ నెల 18న విడుదలవుతోంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మనోజ్ చంద్ర మాట్లాడుతూ 'ప్రవీణ చేసే సినిమాల్లో నటిస్తే సరిపోదు, పాత్రల్లో జీవించాలి. అలా రామకృష్ణ పాత్రకు నేను ప్రాణం పోశానని నమ్ముతున్నాను' అని చెప్పారు.

స్నేహితులే రాజకీయ ప్రత్యర్థులు



ఆది పినిశెట్టి, చైతన్య రావు ప్రధాన పాత్రల్లో 'ప్రస్థానం' ఫేమ్ దేవా కట్టా, జయకిరణ్‌కుమార్ సంయుక్తంగా తెరకెక్కించిన వెబ్ సిరీస్ 'మయసభ'. 'రైజ్ ఆఫ్ ద టైటాన్స్' ట్యాగ్‌లైన్. విజయ్‌కృష్ణ లింగమనేని, శ్రీహర్ష నిర్మించారు. ఆగస్టు 7న ఓటీటీ వేదిక సోనీ లైవ్ ద్వారా అందుబాటులోకి రానుంది. తాజాగా, టీజర్‌ను విడుదల చేశారు. సంభాషణలు, ప్రధాన పాత్రధారుల మధ్య ఉన్న సంఘర్షణ, భావోద్వేగాలు ఆకట్టుకున్నాయి. ఇద్దరు స్నేహితులు కొన్ని పరిస్థితుల వల్ల రాజకీయ ప్రత్యర్థులుగా మారితే ఎలా ఉంటుందనేది కథాంశం. అయితే వీరిద్దరి పాత్రలు ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు, మాజీ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డిని పోలి ఉంటాయని సమాచారం.

చెన్నైలో తెలుగు అబ్బాయి కథ



సంతోష్ శోభన్ హీరోగా నటిస్తోన్న చిత్రం 'కపుల్ ఫ్రెండ్లీ'. అశ్విన్ చంద్రశేఖర్ దర్శకత్వం వహిస్తున్నారు. యూవీ క్రియేషన్స్ సమర్పణలో యూవీ కాన్సెప్ట్స్ తెలుగు, తమిళ భాషల్లో నిర్మిస్తోంది. మ్యూజికల్ రొమాంటిక్ లవ్‌స్టోరీగా ఈ చిత్రం రూపుదిద్దుకుంటోంది. శనివారం సంతోష్ శోభన్ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు చెబుతూ చిత్రబృందం స్పెషల్ పోస్టర్‌ని రిలీజ్ చేసింది. పోస్టర్‌లో చెన్నైలో జీవనం కొనసాగిస్తున్న మధ్యతరగతి తెలుగు అబ్బాయిగా సంతోష్ శోభన్ కనిపిస్తున్నారు. చెన్నై నగరం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ ప్రేమ కథా చిత్రం ప్రేక్షకులకు మంచి అనుభూతిని కలిగిస్తుందని చిత్రబృందం పేర్కొంది.

'సెమిస్టర్'కు కనీస హాజరు ఉండాల్సిందే!

- పరీక్షలకు సంబంధించిన నిబంధన సరైందే
- బీటెక్‌పై హైకోర్టు ధర్మాసనం స్పష్టీకరణ



అమరావతి, జూలై 12(ఆంధ్రజ్యోతి): బీటెక్ విద్యార్థులు సెమిస్టర్ పరీక్షలకు హాజరయ్యేందుకు కనీస హాజరుశాతం తప్పనిసరని హైకోర్టు ధర్మాసనం స్పష్టం చేసింది. దీనికి సంబంధించి జేఎన్‌టీయూ కాకినాడ, జీఎంఆర్ఐటీ రూపొందించిన నిబంధనలను సమర్థించింది. కనీస హాజరు నిబంధన సహేతుకం కాదని, ఏకపక్షం అంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులు చట్టం ముందు నిలబడవని పేర్కొంది. సింగిల్ జడ్జి తీర్పులోని ఈ భాగాన్ని రద్దు చేసింది. అయితే, ప్రస్తుత కేసులో కోర్టు ఆదేశాల మేరకు విద్యార్థి కౌశిక్ తన 4, 5వ సెమిస్టర్‌ను కొనసాగించారని గుర్తు చేసింది. కౌశిక్ 4, 5 సెమిస్టర్లను రద్దు చేసి, తిరిగి ఆయనను 3వ సెమిస్టర్‌కు పంపించడం సముచితం కాదని అభిప్రాయపడింది. ఇలా చేయడం వల్ల కౌశిక్ అకడమిక్ ప్రయోజనాలు దెబ్బతింటాయని పేర్కొంది. జీఎంఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అకడమిక్ రెగ్యులేషన్ 9(ఐ)(జే) ప్రకారం మేకప్ క్లాస్‌లకు హాజరుకావడం ద్వారా తగిన హాజరుశాతం సాధిస్తే పరీక్ష రాసేందుకు అర్హత సాధించవచ్చని గుర్తు చేసింది. హాజరులోపాన్ని సరిదిద్దుకునేందుకు వీలుగా మేకప్ క్లాసలకు హాజరయ్యేందుకు కౌశిక్‌ను అనుమతించింది. ఈ తీర్పుని ప్రత్యేక పరిస్థితుల్లో ఇస్తున్నామని, భవిష్యత్తులో ఈ ఉత్తర్వులను ప్రామాణికంగా తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల తీర్పు ఇచ్చింది. శ్రీకాకుళం జిల్లాలోని జీఎంఆర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్‌లో బీటెక్(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) అభ్యసిస్తున్న బీవీకే కౌశిక్ అనారోగ్యం కారణంగా తరగతులకు హాజరుకాలేకపోయాడు. హాజరుశాతం 65% కన్నా తక్కువగా ఉందనే కారణంతో కళాశాల యాజమాన్యం ఆయనను మూడవ సెమిస్టర్ పరీక్షలకు అనుమతించలేదు. దీంతో కౌశిక్ హైకోర్టును ఆశ్రయించగా, పరీక్షలు రాసేందుకు అనుమతించిన కళాశాల యాజమాన్యం, ఫలితాలు మాత్రం వెల్లడించలేదు. దీంతో మూడవ సెమిస్టర్ ఫలితాలు వెల్లడించడంతో పాటు నాలుగవ సెమిస్టర్ క్లాసులకు హాజరయ్యేందుకు అనుమతించేలా కళాశాల యాజమాన్యాన్ని ఆదేశించాలని కోరుతూ కౌశిక్ మరో పిటిషన్ దాఖలు చేశారు.

ఉపాధి కోసం వెళ్లారు...
ఉగ్ర మూకల బారిన పడ్డారు

- ఇన్‌స్టా ఉద్యోగ ప్రకటనతో మోసపోయిన ఇంజనీరింగ్ నిరుద్యోగులు
- థాయ్‌ల్యాండ్ వచ్చిన వారిని మయన్మార్‌కు తరలింపు
- డ్రగ్స్ తీసుకోవాలంటూ చిత్రహింసలు
- రక్షించాలని తల్లిదండ్రులకు ఫోన్
- డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్‌ను కలిసిన తల్లిదండ్రులు

విజయనగరం, జూలై 12(ఆంధ్రజ్యోతి): మెరుగైన ఉపాధి అవకాశాల కోసం విదేశాలకు వెళ్లిన యువత ఉగ్ర, డ్రగ్స్ ముఠాల చేతుల్లో చిక్కుకోవడంతో స్థానికంగా వారి తల్లిదండ్రులు విలవిలలాడుతున్నారు. తమ పిల్లలను రక్షించి, సురక్షితంగా స్వస్థలాలకు రప్పించాలంటూ కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు. మే నెలలో ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ ఉద్యోగ ప్రకటన వచ్చింది. ఆకర్షణీయమైన ప్యాకేజీ కావడంతో విశాఖపట్నం నుంచి ముగ్గురు, విజయనగరం నుంచి ఇద్దరు, కడప జిల్లా నుంచి నలుగురు, హైదరాబాద్ నుంచి ముగ్గురు... మొత్తం 12 మంది దరఖాస్తు చేసుకున్నారు. నోటిఫికేషన్ ఇచ్చిన థాయ్‌ల్యాండ్ ప్రతినిధులతో వారు మాట్లాడారు. ఇంజనీరింగ్ చేసి, కంప్యూటర్ పరిజ్ఞానం ఉన్న నిరుద్యోగ యువత... ప్రకటనదారులు చెప్పిన తీయని, ఆకర్షణీయమైన కబుర్లను నమ్మారు. వారు సూచించినట్లుగా వారివారి ప్రాంతాల నుంచి బయలుదేరి మే 9న థాయ్‌ల్యాండ్‌కు చేరుకున్నారు. థాయ్‌ల్యాండ్‌లో మొదటి రోజు చక్కగా చూసుకున్న ప్రకటనదారులు... ఆ మరుసటి రోజునే ఉద్యోగం కోసం వచ్చిన వారికి ముసుగులు వేసి మయన్మార్ తరలించారు. వారి కుటుంబ సభ్యులు చెప్పిన సమాచారం మేరకు... ఉద్యోగార్థులందరినీ మయన్మార్‌లో ఒక నది ఒడ్డున ఉన్న క్యాంప్‌లో ఉంచారు. చిత్రహింసలు పెట్టారు. డ్రగ్స్ తీసుకోవాలంటూ ఒత్తిడి చేశారు. నిరాకరించిన వారిపై విచక్షణారహితంగా దాడి చేశారు. వెళ్లిన 12 మందిలో విశాఖ, హైదరాబాద్‌కు చెందిన వారు ఇద్దరు... వారి చెర నుంచి తప్పించుకొని స్వస్థలాలకు చేరుకున్నారు. మిగిలిన 10 మంది అక్కడే ఉన్నారు. ఎవరూ లేని సమయంలో తల్లిదండ్రులకు ఫోన్‌లో తమ పరిస్థితిని బాధితులు వివరించారు. తామున్న ప్రాంతం లొకేషన్‌ను షేర్ చేశారు. తమను రక్షించాలంటూ కన్నీరు పెట్టుకున్నారు. దీంతో బెంబేలెత్తిన తల్లిదండ్రులు పోలీసులను ఆశ్రయించారు. ఇప్పటికే కడప, హైదరాబాద్ ప్రాంతాల్లో కేసులు నమోదయ్యాయి. ఇదే విషయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు లోకేశ్, అనితలను బాధితుల కుటుంబ సభ్యులు కలిశారు. స్పందించిన పవన్ కల్యాణ్, లోకేశ్ విదేశాంగ మంత్రిత్వ శాఖతో మాట్లాడారు. ఆ ఉగ్రమూకల చెరలో మనదేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన సుమారు 200 మంది వరకూ ఉన్నట్లు సమాచారం. తాము చేసుకున్న విన్నపాలపై ఇప్పటి వరకూ ఎలాంటి చర్యలూ లేకపోవడంతో బాధితుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరవుతున్నారు. ప్రాణాలతో తమ పిల్లలను ఇళ్లకు చేర్చాలని వారు కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటున్నారు.

రాష్ట్రానికి 5 స్వచ్ఛ అవార్డులు

- 17న రాష్ట్రపతి చేతుల మీదుగా అందుకోనున్న మంత్రి నారాయణ

అమరావతి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ఐదు నగరాలకు జాతీయ స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు వచ్చాయి. 'సూపర్ స్వచ్ఛ లీగ్ సిటీస్' విభాగంలో 10 లక్షల జనాభాపైబడిన నగరాల్లో విజయవాడ, 3-10 లక్షలకు మధ్య ఉన్న నగరాల్లో గుంటూరు, 50 వేలు - 3 లక్షల మధ్య ఉన్న నగరాల్లో తిరుపతి అవార్డులు గెలుచుకున్నాయి. 'మినిస్టీరియల్ అవార్డ్ ప్రత్యేక కేటగిరి'లో జీవీఎంసీ విశాఖపట్టణం, మినిస్టీరియల్ అవార్డు రాష్ట్ర స్థాయి కేటగిరిలో రాజమండ్రికి అవార్డులు వచ్చాయి. ఈనెల 17న ఢిల్లీలో జరిగే ఓ కార్యక్రమంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా మంత్రి పొంగూరు నారాయణ ఈ అవార్డులను అందుకోనున్నారు. అవార్డుల రాకపై స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ సంతోషాన్ని వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబు సారథ్యంలో చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర ఉద్యమ ఫలితంగానే జాతీయ స్థాయిలో రాష్ట్రంలోని ఐదు నగరాలు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు సాధించాయని అన్నారు. జాతీయస్థాయిలో స్వచ్ఛ అవార్డులు సాధించడంలో విజయవాడ, గుంటూరు, తిరుపతి, విశాఖపట్నం, రాజమండ్రి నగర ప్రజల భాగస్వామ్యం ఎంతో ఉందన్నారు. అవార్డులు రావడానికి శ్రమించిన అధికారులు, పారిశుద్ధ్య సిబ్బందికి పట్టాభి అభినందనలు తెలిపారు.

దారుణమైన దొంగల ముఠా పార్టీ వైసీపీ

● ఎమ్మెల్యే యరపతినేని



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే యరపతినేని

దాచేపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పార్టీ దారుణమైన దొంగల ముఠా అని ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు ఘాటు విమర్శ చేశారు. శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం పొందుగులలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి ఏడాదిలో చేసిన అభివృద్ధి పనులను ప్రజలకు యరపతినేని వివరించారు. తల్లికి వందనం పథకం ఇంట్లో ఉన్న విద్యార్థులందరికీ ఇవ్వడంతో మధ్య తరగతి కుటుంబాలకు భరోసా కల్పించినట్లయిందని పేర్కొన్నారు. దీపం పథకం ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ఆగస్టు 15 నుంచి ప్రారంభం అవుతుందన్నారు. కిసాన్ మేళాను ఈ నెల 17న నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే యరపతినేని తెలిపారు. నడికుడి వ్యవసాయ మార్కెట్ యార్డులో నిర్వహించనున్న మేళాకు ఉద్యాన, వ్యవసాయ, మత్స్య, అటవీ శాఖాధికారులతోపాటు శాస్త్రవేత్తలు హాజరు కానున్నట్లు తెలిపారు. శాస్త్రవేత్తలు పత్తి, మిర్చి, కంది, వరి తదితర పంటల యాజమాన్య పద్ధతులను వివరించి, రైతుల సందేహాలను నివృత్తి చేస్తారని చెప్పారు. ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ అరుణ్‌బాబు హాజరు కానున్నారని తెలిపారు.

నేటి నుంచి ఇంజనీరింగ్ వెబ్ కౌన్సెలింగ్

● ఉమ్మడి జిల్లాలో మూడు సహాయక కేంద్రాలు ● జాగ్రత్తలు పాటించాలంటున్న అధ్యాపకులు

గుంటూరు (విద్య) జూలై 12 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కళాశాలలో ప్రవేశం కోసం ఆదివారం నుంచి వెబ్ కౌన్సెలింగ్ ప్రారంభం కానుంది. ఈ నెల 16వ తేదీ వరకు ర్యాంకుల వారీగా రిజిస్ట్రేషన్ ప్రక్రియ కొనసాగుతోంది. అదేవిధంగా సర్టిఫికెట్ల పరిశీలన కూడా ఈ నెల 17వ తేదీ వరకు కొనసాగిస్తారు. రిజిస్ట్రేషన్, సర్టిఫికెట్ల పరిశీలన పూర్తిచేసుకుని ఫీజు చెల్లించిన విద్యార్థులు వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొంటారు.

వెబ్ కౌన్సెలింగ్‌లో ఈ జాగ్రత్తలు పాటించండి

ఇంజనీరింగ్ ప్రవేశాల్లో కీలక దశ వెబ్ కౌన్సెలింగ్‌లో విద్యార్థులు, తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని ఇంజనీరింగ్ కళాశాలల అధ్యాపకులు సూచిస్తున్నారు.

- కౌన్సెలింగ్‌కు ముందు కళాశాలల జాబితా సిద్ధం చేసుకోవాలి. ఆయా కళాశాలల గత నాలుగైదు సంవత్సరాల ఫలితాలు, ప్రాంగణ ఎంపికలు, అధ్యాపకుల వివరాలు, ఎన్‌బీఏ గుర్తింపు, అటానమస్ స్టేటస్ తదితర అంశాలను పరిశీలించుకోవాలి.
- కొన్ని కళాశాలల్లో పైకి పెద్ద భవనాలు కనిపిస్తున్నా.. లోపల బోధన అస్తవ్యస్తంగా ఉంటుంది. విద్యార్థులకు అపరిమిత స్వేచ్ఛ ఇవ్వడంతో ఇంజనీరింగ్ మొదటి సంవత్సరం నుంచే గాడి తప్పే అవకాశం పొంచి ఉంది.
- సొంత బస్సులు ఉన్న కళాశాలలను ఎంచుకుంటే రవాణాలో భద్రత ఉంటుంది. ఇంటి నుంచి కళాశాలకు వెళ్లేందుకు కనీసం 45 నిమిషాలు లేదా గంట సమయం పడితే సరే.. అంతకుమించి ఎక్కువ సమయం పడితే అటువంటి కళాశాలను ఎంచుకోకపోవడమే ఉత్తమం.
- వెబ్ కౌన్సెలింగ్‌లో ఆప్షన్ ఎంచుకునే సమయంలో ముందుగా కళాశాల పేరు, అందులో ఉన్న బ్రాంచీలు పేపర్ పై నోట్ చేసుకొని తర్వాత కంప్యూటర్‌లో నమోదు చేసుకోవాలి. సాధ్యమైనంత వరకు ఎక్కువ కళాశాలలో ఎక్కువ బ్రాంచ్‌లు ఆప్షన్స్‌లో నమోదు చేసుకోవాలని అధ్యాపకులు సూచిస్తున్నారు.
- వెబ్ ఆప్షన్స్ సమయంలో విద్యార్థులు, వారి తల్లిదండ్రుల మొబైల్ ఫోన్ నంబర్లకు ఓటీపీ వస్తుంది. దీనిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోకూడదు. ఓటీపీ ఇతరులకు తెలిస్తే కళాశాలలో వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ వారి చేతుల్లోకి వెళ్లిపోయే అవకాశం ఉంది.
- గుంటూరు నగరానికి సమీపంలోని ఎంటీటీఎస్ పాలిటెక్నిక్ కళాశాల, నరసరావుపేటలోని జేఎన్‌టీయూ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ప్రత్యేకంగా సాంకేతిక విద్యాశాఖ సహాయక కేంద్రాలు ఏర్పాటు చేసింది. వెబ్ కౌన్సెలింగ్‌లో సందేహాలు, సీట్లు ఎంచుకోవడంలో ఉన్న అనుమానాలను ఇక్కడ నివృత్తి చేస్తారు. ఇక్కడి నుంచే వెబ్ ఆప్షన్స్ ఇచ్చుకునే అవకాశం విద్యార్థులకు కల్పించారు.

రూ.700.. 42 రకాల వైద్య పరీక్షలు

◆ 20 నిమిషాల్లో ఫోన్‌కు రిపోర్టు ◆ ప్రారంభించిన ఎమ్మెల్యే ప్రత్తిపాటి



ఆధునిక యంత్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి

చిలకలూరిపేట, జూలై 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రత్తిపాటి గార్డెన్స్‌లో తక్కువ వ్యయంతో వేగంగా ఆరోగ్య వివరాలు తెలిపే ఆధునిక యంత్రాన్ని శనివారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చారు. ఈ యంత్రాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. దండమూడి హెల్త్ ఆఫీస్ సర్వీస్ (డీహెచ్‌ఓ ఎస్) అరవింద కుమార్ తోడ్పాటుతో ఈ యంత్రాన్ని అమర్చారు. కేవలం సేవా దృక్పథంతో అక్కడ అయ్యే ఖర్చులను మాత్రమే దృష్టిలో పెట్టుకొని కేవలం రూ.700కు 42 రకాల వైద్య పరీక్షలను ఈ మెషిన్ ద్వారా చేస్తారు. కేవలం 20 నిమిషాలలో రిపోర్టును సంబంధిత వ్యక్తుల సెల్ ఫోన్‌కు పంపుతారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పుల్లారావు అరవింద్ కుమార్‌ను అభినందించారు. చిలకలూరిపేట ప్రాంత ప్రజలకు ముఖ్యంగా పేదలకు ఈ యంత్రం ఎంతగానో ఉపయోగపడుతుందని ఆయన పేర్కొన్నారు.

సజావుగా ఏఎన్‌యూ దూరవిద్య పరీక్షలు

తనిఖీ చేసిన కేంద్రం డైరెక్టర్ ఆచార్య వెంకటేశ్వర్లు



పరీక్ష కేంద్రంలో తనిఖీ చేస్తున్న దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వెంకటేశ్వర్లు

పెదకాకాని, జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (సీడీఈ) ఆధ్వర్యంలో జరుగుతున్న యూజీ, పీజీ, డిప్లమా పరీక్షల కేంద్రాలను దూర విద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వంకాయల పాటి వెంకటేశ్వర్లు శనివారం తనిఖీ చేశారు. తాడికొండలోని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా డిగ్రీ కాలేజ్, ప్రభల లక్ష్మీ నారాయణ మెమోరియల్ కళాశాలల్లోని పరీక్ష కేంద్రాలను ఆయన సందర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 114 పరీక్ష కేంద్రాల్లో జరుగుతున్న దూర విద్య పరీక్షలను సజావుగా నిర్వహించడానికి పటిష్టమైన చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. సెమిస్టర్ విధానంతో పాటు, వార్షిక, సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతున్నాయని తెలిపారు. ఈ పరీక్షలు ఆగస్టు 7వ తేదీ వరకు కొనసాగుతాయన్నారు.

చర్లపల్లి, ధర్మవరానికి ప్రత్యేక రైళ్లు

గుంటూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా గుంటూరు మీదగా చర్లపల్లి, ధర్మవరానికి ప్రత్యేక రైళ్లను నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే శాఖ నిర్ణయించింది. 07003 చర్లపల్లి-ధర్మవరం రైలు ఈ నెల 13, 20, 27, ఆగస్టు 3, 10, 17, 24 తేదీల్లో రాత్రి 7.55 గంటలకు చర్లపల్లిలో బయలుదేరి 10.48కి నడికుడి, 11.48కి సత్తెనపల్లి, అర్ధరాత్రి దాటాక 12.45కి గుంటూరు, 1.45కి తెనాలి, 2.33కి బాపట్ల, మరుసటి రోజు ఉదయం 9.20కి తిరుపతి, మధ్యాహ్నం 3 గంటలకు ధర్మవరం చేరుకొంటుంది. 07004 ధర్మవరం - చర్లపల్లి ప్రత్యేక రైలు ఈ నెల 14, 21, 28, ఆగస్టు 4, 11, 18, 25 తేదీల్లో సాయంత్రం 4.30కి బయలుదేరి రాత్రి 8.55కి తిరుపతి, మరుసటి రోజు వేకువజామున 4.26కి గుంటూరు, 5.43కి సత్తెనపల్లి, ఉదయం 6.13కి నడికుడి, 11 గంటలకు చర్లపల్లి చేరుకొంటుంది.

వైసీపీ కార్యకర్త గోపీ అరెస్టు

రిమాండ్‌కు తరలింపు

మాచర్లటౌన్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కార్యకర్త మల్లెల గోపీ అలియాస్ డీజేను పట్టణ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. మాచర్ల పట్టణంలో 2022 డిసెంబరు 16 టీడీపీ కార్యాలయంపై దాడి చేసి ధ్వంసం చేసిన కేసులో గోపీ నిందితుడు. టీడీపీ పార్టీ ఆఫీసు తగలబెట్టిన సమయంలో కారు డ్రైవర్ బత్తుల వెంకటేశ్వర్లుపై రాడ్డుతో దాడి చేశాడు. లోపల కార్యకర్తలు ఉన్నారని తెలిసి కూడా కార్యాలయంపై పెట్రోలు పోసి నిప్పంటించిన ఘటనలో నిందితుడు. దుర్గి మండలంలో ఓ హోంగార్డుపై దాడి, మాచర్ల పట్టణంలో బొండా ఉమ, బుద్దా వెంకన్నపై దాడి ఘటన, మున్సిపల్ మాజీ చైర్మన్ తురకా కిశోర్‌తో కలిసి తెలంగాణలో కిడ్నాప్‌కు పాల్పడిన ఘటన ఇలా పలు కేసుల్లో అతను నిందితుడిగా ఉన్నాడు. ఈ కేసుల్లో మాచర్ల పట్టణ పోలీసులు శనివారం గోపీని అరెస్ట్ చేసి.. మాచర్ల కోర్టులో హాజరుపరిచారు. న్యాయమూర్తి శ్రీనివాస్ కల్యాణ్ 14 రోజుల రిమాండ్ విధించారు. నిందితుడిని పోలీసులు గురజాల సబ్ జైలుకు తరలించారు.

బతుకు భారమై అమ్మ ఆత్మహత్య

- కన్నబిడ్డలపైనా.. పెట్రోల్ పోసి నిప్పంటించే యత్నం
- పరుగులు తీయడంతో తప్పించుకున్న చిన్నారులు
- అప్పుల భారంతో భర్త బలవన్మరణం
- సంవత్సరీకం రోజే విషాదం



సుబ్బమ్మ కుమారుడు అఖిల్‌రెడ్డి, కుమార్తె లక్ష్మీకార్తిక

మాచర్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): కష్ట సుఖాల్లో తోడుంటానని తాళి కట్టి ప్రమాణం చేసిన భర్త అప్పుల భారంతో బలవన్మరణం చెందాడు. అనంతరం బతుకు భారమై.. భార్య కూడా భర్త వద్దకే వెళ్లాలనుకుంది. భర్త సంవత్సరికం రోజునే ఇద్దరు పిల్లలనూ తనతో తీసుకెళ్లాలన్న నిరాద్దాక్షిణ్య నిర్ణయానికి వచ్చింది. అటవీ ప్రాంతానికి కొడుకు, కూతురిని తీసుకెళ్లి వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను తనపై, వారిపై పోసి నిప్పంటించుకునే ప్రయత్నం చేసింది. అయితే చిన్నారులిద్దరూ భయంతో పరుగులు పెట్టడంతో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారు. కానీ, అమ్మ మాత్రం అగ్నికి ఆహుతైంది. దీంతో ఆ ఇద్దరు చిన్నారులు అనాథలైన విషాదకర ఘటన మాచర్ల మండలంలోని కొత్తపల్లి గ్రామంలో తీవ్ర కలకలం రేపింది. వివరాల మేరకు.. కొత్తపల్లి గ్రామానికి చెందిన దగ్గుల సుబ్బమ్మ(32)కు అదే గ్రామానికి చెందిన బ్రహ్మారెడ్డితో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఒక కుమారుడు, కుమార్తె ఉన్నారు. తనకున్న కొంత పొలంతోపాటు మరికొంత కౌలుకు తీసుకొని పత్తి, మిర్చి సాగు చేశారు. పంటలు సరిగా పండక, సరైన దిగుబడి లేక సుమారు రూ. 10 లక్షల వరకు అప్పులయ్యాయి. అప్పులు తీర్చే మార్గం కానరాక.. బ్రహ్మారెడ్డి మనస్తాపంతో గతేడాది ఇదే రోజున పురుగు మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భర్త మరణంతో సుబ్బమ్మ మానసికంగా కుంగిపోయింది. బతుకు భారమైంది. కడుపున పుట్టిన చిన్నారులను పోషించడం కష్టతరంగా మారింది. భర్త మరణించిన రోజునే తాను కూడా మరణించాలని శనివారం కుమారుడు పన్నెండేళ్ల అఖిల్‌రెడ్డి, పదకొండేళ్ల కుమార్తె లక్ష్మీకార్తికతో కలిసి అనుపునకు చేరుకున్నారు. అక్కడ అటవీ ప్రాంతంలో వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను సుబ్బమ్మ తనపై పోసుకొని.. పిల్లలపై కూడా పోసింది. అయితే.. పిల్లలు భయంతో పారిపోతూ అక్కడ సెక్యూరిటీ గార్డు కంటపడ్డారు. అతను విచారించగా.. పిల్లలు జరిగిందంతా చెప్పారు. దీంతో సెక్యూరిటీ గార్డు, పిల్లలు కలిసి సుబ్బమ్మ వద్దకు వెళ్లగా ఆమె అప్పటికే నిప్పంటించుకొని కాలిపోయింది. విషయం తెలుసుకున్న విజయపురిసౌత్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మాచర్ల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఆచార్య ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాలకు ఆహ్వానం

గుంటూరు(తూర్పు), జూలై 12(ఆంధ్రజ్యోతి): ఆచార్య ఎన్జీ రంగా సాహిత్య పురస్కారాలు-2025కు రచయితల నుంచి కథా సంపుటాలను ఆహ్వానిస్తున్నట్లు ఆచార్య ఎన్జీ రంగా ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ జక్కంపూడి సీతారామారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు తమ కథా సంపుటాలను నాలుగు ప్రతులు చొప్పున.. డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ, 202 శ్రీ వెంకట సాయి రెసిడెన్సి, 2వ లైను, రామయ్య నగర్, ఒంగోలు, ప్రకాశం జిల్లా చిరునామాకు ఆగస్టు 9వ తేదీలోగా పంపించాలని పేర్కొన్నారు. నవంబరు 7న గుంటూరులో జరిగే ప్రొఫెసర్ రంగా జన్మదినం సందర్భంగా విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తారని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 98494 97739, 93930 15584, 98483 51517 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సాగర్ ప్రాజెక్టు నీటి సమాచారం

మాచర్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ప్రాజెక్టు నీటి మట్టం శనివారం నాటికి 548.60 అడుగులు ఉంది. ఇది 206.70 టీఎంసీలకు సమానం. ఎస్ఎల్‌బీసీ 1650 క్యూసెక్కులు, మొత్తం ఔట్‌ఫ్లో వాటర్‌గా 1650 క్యూసెక్కుల నీరు దిగువకు విడుదల చేస్తున్నారు. కాగా శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు ఇన్‌ఫ్లో వాటర్‌గా 62,400 క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.15 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్ (కిలో)	101, 109, 120
చికెన్ విత్ స్కిన్(కిలో)	194.00
చికెన్ స్కిన్ లెస్(కిలో)	205.00

నగరపాలక సంస్థ, గుంటూరు

Roc No. 324974/2021/G1, Dated : 11-07-2025

పత్రికా ప్రకటన

AP బిల్డింగ్ రూల్స్ – 2017 (సవరించబడిన) నియమం 167 మరియు 168 కింద అందించబడిన అధికారం ప్రకారం, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్‌తో సహా పట్టణ స్థానిక సంస్థలు రోడ్డు విస్తరణ వంటి ప్రజా ప్రయోజనాల కోసం ఏదైనా ప్రైవేట్ భూమిని స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యామ్నాయంగా అభివృద్ధి హక్కుల బదిలీని (TDR) ఉపయోగించుకుంటున్నాయి.

దిగువ జాబితా చేయబడిన TDR లు వివిధ రహదారుల కోసం / కొత్త రహదారి కోసం / రహదారి విస్తరణ కోసం / పబ్లిక్ పర్పస్ కోసం TDR బాండ్లను జారీ చేయాలని ప్రతిపాదించబడింది.

SL.NO	NAME OF THE LAND OWNER (SRI/SMT)	D.NO/ T.S NO/ R.S NO	NAME OF THE VILLAGE	DOOR NO.	EXTENT OF THE SITE AFFECTED / REQUIRED	STATUS OF THE LAND (VACANT/ BUILDING)
JKC COLEGE (MAHALAKSHMI BAR TO RTO OFFICE) ROAD						
1.	BASAVA SIVA PRASAD S/o LAKSHMANRAO	D No.276	Pedapalakaluru	NIL	36.37 Sq. mts	VACANT
2.	PUNATI VENKATA MANOHARA RAO S/O PUNATI LAKSHMI NARASAIAH	D.No.110	Koretipadu	NIL	134.61 Sq.mts	VACANT
MAHATMA GANDHI INNER RING ROAD PHASE-3 FROM SWARNA BHARATHI NAGAR TO PEDAPALAKALURU						
3.	YEDUBATI LEELA KRISHNA RAO S/o.VENKATA SUBBAIAH	D.No. 465/3	Pedapalakaluru	NIL	101.17 Sq.mts	VACANT
4.	MANGAMURI BHARGAVI DEVI W/o. VENUGOPAL	D.No. 465/3	Pedapalakaluru	NIL	202.34 Sq.mts	VACANT
ROAD WIDENING FROM GUJJANAGUNDLA JUNCTION TO OLD GMC LIMITS (PEDAPALAKALURU ROAD)						
5.	LAVU ARUNA W/o. SATISH	308/B	Koretipadu	NIL	94.0 Sq.mts	VACANT
6.	BAVANAM SRINIVASA REDDY S/o. VENKATA REDDY	305/1	Koretipadu	NIL	105.81 Sq.mts	VACANT
7.	MULPURI RADHIKA S/o MULPURI UMAMAHESWARA REDDY	305/1	Koretipadu	NIL	88.33 Sq.mts	VACANT
8.	MARREDDY VENKATA REDDY S/o SIVA RAMA REDDY	368/A1	Pedapalakaluru	NIL	127.50 Sq.mts	VACANT
WIDENING OF MASTER PLAN ROAD FROM LODGE CENTER TO HINDU COLLEGE JUNCTION						
9.	Provincial superior congregation of jesusmary josseph , Guntur Province, Mangalagiri (ST. Joseph's Quarters)	Ward No.17 Block No. 9 T.S. No. 1043	Guntur	27-1-20	102.86 Sq.mts	JMJ QUARTERS
10.	Darapaneni Vengal Rao S/o D.Venkateswarlu	Ward No.17 Block No. 9 T.S. No.231, 10421043	Guntur	27-1-19/A	33.44 Sq.mts	Building
11.	Darapaneni Ramakrishna S/o Late D.Venkateswarlu	Ward No.17 Block No. 9 T.S. No.231, 10421043	Guntur	27-1-19/A	33.44 Sq.mts	Building

అందువలన పై పేర్కొన్న 11 టిడిఆర్ బాండ్ల జారీ చేయు విషయమై గుంటూరు నగరపాలక సంస్థ కార్యాలయము నుండి ఈ ప్రకటన జారీ చేయబడిన తేది నుండి 07 రోజులలోపు తమ అభ్యంతరాలు / సూచనలు ఏమైనా ఉంటే లిఖితపూర్వకంగా సమర్పించాలని సాధారణ ప్రజలకు తెలియజేయడమైనది మరియు పైన పేర్కొన్న టిడిఆర్ బాండ్ల జారీ ప్రక్రియ నిబంధనల ప్రకారం చేయబడుతుంది.

సం/- కమీషనరు, నగరపాలక సంస్థ, గుంటూరు

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి రూ. 14,15,822 విలువ గల చెక్కులను అర్హులైన 25 మంది లబ్ధిదారులకు శనివారం బాపట్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో అందజేశారు. బాపట్ల మండలం గుడిపూడి గ్రామానికి చెందిన కందేపూడి రామారావుకు రూ.3,25,368, బాపట్ల మండలం ఆదర్శనగర్‌కు చెందిన కొక్కిలిగడ్డ రామకృష్ణకు రూ.1,56,652, అడవిపల్లెపాలెం గ్రామానికి చెందిన చౌడిపల్లి కనకరాజుకు రూ.84,928, గోపాపురం గ్రామానికి చెందిన కుంచర్ల లోకనందంకు రూ.65,918, నందిరాజుతోట గ్రామానికి చెందిన మామిడాల శేషమోహనరావుకు రూ.56,779, కంకటపాలెం గ్రామానికి చెందిన ఆవుల వెంకటేశ్వర్లుకు రూ.53,721, పూండ్ల గ్రామానికి చెందిన కోట వెంకటేశ్వర్లుకు రూ.51,486, పిన్నిబోయనవారిపాలెం గ్రామానికి చెందిన డి.చిన్నకు రూ.51,310, చెరువుజమ్ములపాలెం గ్రామానికి చెందిన కె.కియాష్కు రూ.45,350, అప్పికట్ల గ్రామానికి చెందిన షేక్ ఖాశీం సాహెబ్‌కు రూ.43,100, ముత్తాయపాలెం గ్రామానికి చెందిన కర్రి వీర్లంకయ్యకు రూ.43,020, కొండుభొట్లవారిపాలెం గ్రామానికి చెందిన యు పావనికి రూ.42,610, అడవిపల్లెపాలెం గ్రామానికి చెందిన పి.అప్పలరాజుకు రూ.44,350, నందిరాజుతోట గ్రామానికి చెందిన బొర్రా వీరవసంతరావుకు రూ.40 వేలు, అడవిపల్లెపాలెం గ్రామానికి చెందిన బండి మార్తకు రూ.37,724, మరుప్రోలువారిపాలెం గ్రామానికి చెందిన మేరుగు రాజారావుకు రూ.35,800, వెదుళ్ళపల్లి గ్రామానికి చెందిన ఎం.శ్రీనివాసరావుకు రూ.35,880, నందిరాజుతోట గ్రామానికి కాసాని శంకరరావుకు రూ.33,070, మూలపాలెం గ్రామానికి చెందిన బెజ్జం సాగర్‌కు రూ.30,514, బేతపూడి గ్రామానికి చెందిన దిండు సాయి ఆదిరామారెడ్డికి రూ.30,541, పిన్నిబోయనవారిపాలెం గ్రామానికి చెందిన పి.కాశీకాంబకు రూ.26,479 , ఆదర్శనగర్‌కు చెందిన కె.పద్మకు రూ.26,240, అప్పికట్ల గ్రామానికి చెందిన ఇనగంటి అమరేశ్వరికి రూ.20,524, అడవిపల్లెపాలెం గ్రామానికి చెందిన గుడిపల్లి చిట్టెమ్మకు రూ.20,295, కృపానగర్‌కు చెందిన జి.కుసుమకు రూ.18,163 చెక్కులను ఎమ్మెల్యే నరేంద్రవర్మ లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బాపట్ల మండల పార్టీ అధ్యక్షులు ముక్కామల సాంబశివరావు, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


లబ్ధిదారులకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే నరేంద్రవర్మ

కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ వినతి

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మకు వినతిపత్రం అందజేశారు. న్యాయమైన తమ డిమాండ్‌లను తక్షణమే పరిష్కరించాలని, జీవోనెంబరు 36ను అమలు చేసేవిధంగా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి సి.హెచ్. మజుందార్, పట్టణనాయకులు కె.శరత్, ఇంజనీరింగ్ కార్మికుల సంఘ నాయకులు రత్నం, నాని, మురళికృష్ణ, హరిబాబు, ప్రమీల, ఏసమ్మ, నరేష్, సాంబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా చండీహోమం


భావదేవ నగర్‌లో హోమం నిర్వహిస్తున్న పండితులు, భక్తులు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని వివేకానంద కాలనీ భావదేవనగర్‌లో శనివారం అత్యంత వైభవంగా చండీహోమం జరిపారు. శిఖరం ఫణిరాజశర్మ, గంటా శ్రీనివాసరావు (చిన్న), మధుసూదనరావు మిత్రబృందం లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ కార్యక్రమానికి చెన్నైకి చెందిన శ్రీవిద్య ఉపాసకుహానంద మండలికి చెందిన గోతేటి శ్రీనివాసరావు శిష్యబృందం పాల్గొని శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. చండీహోమం, ఆయుష్‌హోమం, పూర్ణాహుతి చేశారు. తదుపరి సుహాసిని పూజ, వటుకభైరవపూజ, బాలపూజ చేశారు. కార్యక్రమానికి పరిసర ప్రాంత భక్తులు పెద్దఎత్తున హాజరై పూజలు చేశారు. ఆదివారం ప్రత్యక్ష అష్టోత్తర శతసుహాసిని పూజ జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు.

పైపులైన్‌కు లీక్‌లు... తాగునీరు వృథా


జీబీసీ రోడ్డులో మూర్తిరక్షణ్‌నగర్ వద్ద పైపులైన్‌కు లీక్ ఏర్పడి బయటకొస్తున్న తాగునీరు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని జీబీసీ రోడ్డులో మూర్తిరక్షణ్‌నగర్ వద్ద తాగునీటి పైపులైన్‌కు లీక్‌లు ఏర్పడ్డాయి. ఇప్పటికే అనేక లీక్‌లకు మరమ్మతులు చేసిన అధికారులు అక్కడ ఉన్న స్తంభాలను తొలిగించటంతో మరికొన్ని లీక్‌లు ఏర్పడ్డాయి. దీంతో తాగునీరు వృథా అవుతున్నది. పైపులైన్‌లో ప్రవహించాల్సిన నీరు బయటకు ఉబికి కాల్వల ప్రవహిస్తున్నది. మున్సిపల్ అధికారులు వెంటనే మరమ్మతులు చేయించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు. కాగా ఈ విషయమై మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డిని వివరణ కోరగా ఇప్పటికే అనేక లీక్‌లకు మరమ్మతులు చేయించామని, మరలా లీక్‌లు ఏర్పడితే వెంటనే మరమ్మతులు చేసి సరఫరాలో అంతరాయం లేకుండా చూస్తామని చెప్పారు.

రోటరీ క్లబ్ రీజనల్ ఛైర్మన్‌గా జిట్టా శ్రీనివాసరావు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ 3150 రీజనల్ ఛైర్మన్‌గా బాపట్ల రోటరీ క్లబ్ మాజీ అధ్యక్షుడు, తెలుగుదేశం పార్టీ నాయకుడు జిట్టా శ్రీనివాసరావును నియమించారు. నూతనంగా నియమించబడిన జిట్టా శ్రీనివాసరావును డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ ఎస్వి.రాంప్రసాద్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రోటరీ కార్యక్రమాలలో మరింత చురుకుగ్గా పాల్గొని రోటరీ డిస్ట్రిక్ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రీజనల్ ఛైర్మన్‌గా తనను నియమించిన వారికి, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈసందర్భంగా పలువురు జిట్టాను అభినందించారు.


జిట్టా శ్రీనివాసరావును అభినందిస్తున్న డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ రాంప్రసాద్

రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా వేజండ్ల ఎన్నికపై హర్షం



వేజండ్ల శ్రీనివాసరావుకు శుభాకాంక్షలు తెలియజేస్తున్న ఇక్కుర్తి శ్రీనివాసరావు

కర్లపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రోటరీ క్లబ్‌లో వేజండ్ల శ్రీనివాసరావు విశేష సేవలందిస్తున్నారని, ఆయనను రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నుకోవటం హర్షణీయమని కాపు సేవా సంఘ అధ్యక్షుడు ఇక్కుర్తి శ్రీనివాసరావు అన్నారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడిగా ఎన్నికైన వేజండ్ల శ్రీనివాసరావుకు ఇక్కుర్తి శ్రీనివాసరావు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వేజండ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ రోటరీక్లబ్ సేవలను ముందుకు తీసుకెళతానని అన్నారు.

నేడు పెరవలిపాలెం, పెరవలిలో 'సుపరిపాలనలో తొలి అడుగు'

వేమూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెరవలిపాలెం, పెరవలి గ్రామాల్లో ఆదివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఉదయం 10 గంటలకు పెరవలిపాలెం గ్రామంలో, 11 గంటలకు పెరవలి గ్రామంలో ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు పాల్గొంటారని తెలిపారు. మండల పరిధిలోని కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన

● ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ


జమేదారుపేటలో ప్రజలకు కరపత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

బాపట, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సుపరిపాలన సాగుతుందని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. బాపట్ల పట్టణం 8వ వార్డు జమేదారుపేటలో శనివారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం జగన్మోహనరెడ్డి చేసిన అప్పులు, బకాయిలు తీర్చుకుంటూ రాష్ట్రాన్ని అభివృద్ధి, సంక్షేమం దిశగా సాగిస్తున్నారన్నారు. అభివృద్ధిని ప్రతి ఇంటికి చేరవేయాలనే సంకల్పంతో ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామన్నారు. ప్రజలను అప్యాయంగా పలకరిస్తూ కరపత్రాలను ప్రజలకు అందిస్తూ ప్రతి కుటుంబాన్ని కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకొని వాటి పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకోవాలని నాయకులకు, అధికారులకు ఎమ్మెల్యే నరేంద్రవర్మ సూచించారు.

ఈ కార్యక్రమంలో బాపట్ల నియోజకవర్గ పరిశీలకులు బొంతు శివసాంబిరెడ్డి, బాపట్ల పట్టణ అధ్యక్షుడు గొలపల శ్రీనివాసరావు, వార్డు ప్రెసిడెంట్ చింతా ఏసోబు, క్లస్టర్, యూనిట్, బూత్ ఇన్‌చార్జి, వార్డు కమిటీ నాయకులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటున్న క్షత్రియ సమాజం

● బాపట్ల ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

పిట్టలవానిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : సేవా కార్యక్రమంలో క్షత్రియ సమాజం ముందంజలో ఉంటుందని, రాజకీయాలకు అతీతంగా నిరుపేదలకు సహాయ సహకారాలు అందించటం ఎంతో గొప్ప అవకాశమని ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ అన్నారు. మండలంలోని మంతెనవారిపాలెం గ్రామంలో శనివారం తూర్పు గోదావరి జిల్లా పాతర్లమెరక గ్రామానికి చెందిన వేగిరాజు శివవర్మ ఆధ్వర్యంలో 40 మంది క్షత్రియ పెద్దలు మంతెనవానిపాలెం గ్రామానికి విచ్చేసి గ్రామప్రజలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. వేగిరాజు శివవర్మ మాట్లాడుతూ ఆదర్శ గ్రామ స్థాపనలో ఎటువంటి పద్ధతులు ఆచరించాలో మంతెనవారిపాలెం గ్రామపెద్దలతో చర్చించారు. పిట్టలవానిపాలెం, కర్లపాలెం మండలాలలో జరుగుతున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు, పూర్వపుపెద్దలు అభివృద్ధి చేసిన వ్యవస్థలు వాటిని పరిశీలించి భవిష్యత్తులో ఈ ప్రాంత గ్రామాలు ఎలా అభివృద్ధి చేసుకోవాలో చర్చించుకున్నారు. తొలుత మంతెన వెంకటరాజు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మంతెన కరుణరాజు, మంతెన సూర్యనారాయణ రాజు, మంతెన నరసింహమూర్తిరాజు, మంతెన శ్రీనివాసరాజు, గ్రామసర్పంచ్ లక్కంరాజు ఆదిలక్ష్మి వెంకటపతిరాజు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగేశన నరేంద్రవర్మ

రోడ్లపై గుంతలకు మరమ్మతులు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ప్రధాన రహదార్లపై ఏర్పడిన గుంతలు, పైపులైన్ మరమ్మతులు, వీధిదీపాల వైర్ల కోసం తవ్విన గుంతలు మొత్తానికి మరమ్మతులు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. శనివారం ప్రత్యేక వాహనంలో మెటల్‌డస్ట్ తీసుకొచ్చి గుంతలు పూడ్చి సరిచేశారు. రెండురోజుల్లో బీటీగా మారుస్తామని మున్సిపల్ డీఈ కృష్ణారెడ్డి తెలిపారు.


ప్రధాన రహదార్లపై ఏర్పడిన గుంతలను పూడుస్తున్న మున్సిపల్ కార్మికులు

టెన్నిస్ క్రికెట్‌లో పాల్గొన్న హైవెండ్ విద్యార్థులు

కర్లపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రెండో సౌత్ ఇండియా చాంపియన్‌షిప్ టెన్నిస్ క్రికెట్ అసోసియేషన్ పోటీలలో ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున కర్లపాలెం హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు. రెండో సౌత్ ఇండియా చాంపియన్‌షిప్ పోటీలను బాపట్లలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల గ్రౌండ్‌లో ప్రారంభించగా ఆంధ్రప్రదేశ్ జట్టు తరుపున అండ -14 విభాగంలో హైవెండ్ హైస్కూల్ విద్యార్థులు తమిళనాడు రాష్ట్ర జట్టుపై పోటీపడ్డారు. అండర్ -14, అండర్ -17లు జాతీయ స్థాయి విభాగంలో ఆంధ్ర, తెలంగాణ, తమిళనాడు సెమి ఫైనల్స్‌కు చేరుకున్నాయని సౌత్‌జోన్ సెక్రటరి బి. హరికృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో అరుణ్‌జేషన్, కార్యదర్శి ఎ. రాంబాబు, కోర్‌కమిటీ బత్తుల వీరశేఖర్, సీసా ఇంటర్నేషనల్ కోర్సు అకాడమి శ్రావణ్‌కుమార్, పీఈటీ, పీడీలు పాల్గొన్నారు.


రెండో సౌత్ ఇండియా టెన్నిస్ క్రికెట్‌లో పాల్గొన్న హైవెండ్ హైస్కూల్, తెలంగాణ విద్యార్థులు

చెరువుకు నీరు...ఇబ్బందిలేదు తాగునీరుకు


సమ్మర్‌స్టోరేజ్ ట్యాంక్‌ను నీటితో నింపుతున్న చిత్రం

బాపట్ల,జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పిటి ఛానల్‌కు నీరు విడుదల కావటంతో మున్సిపల్ అధికారులకు సమ్మర్‌స్టోరేజి ట్యాంక్‌ను నీటితో నింపుతున్నారు. మోటర్లు, ఆయిల్ ఇంజన్‌ల ద్వారా కాల్వలోని నీటిని చెరువులోకి డంప్ చేస్తున్నారు. చెరువులో నీరు డెడ్ స్టోరేజికి చేరుతున్న సమయంలో అధికారులు స్పందించి కాల్వకు నీరువిడుదల చేశారు. దీంతో చెరువును పూర్తిస్థాయిలో నీటితో నింపేందుకు కమిషనర్ జి.రఘునాధరెడ్డి ఆధ్వర్యంలో డీఈ కృష్ణారెడ్డి సిబ్బందితో కలిసి చర్యలు చేపట్టారు. ప్రస్తుతం కాల్వకు నీరు రావటంతో నీటిని 24అడుగులు నింపుతామని అధికారులు తెలిపారు.



డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న మురళీమోహన్

మురళీమోహన్‌కు భారత పద్మ ప్రతిభ అవార్డు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని వెల్లటూరు పాఠశాలలో సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న గుర్రం మురళీమోహన్‌కు భారత పద్మ ప్రతిభ అవార్డు లభించింది. హైదరాబాద్ మనం ఫౌండేషన్ వార్షికోత్సవం పురస్కరించుకుని త్యాగరాజుగాన సభలో దక్షిణ భారత దేశంలోని వివిధ రంగాల్లో ప్రతిభ చూపిన వారికి స్వచ్ఛందంగా గుర్తించి అవార్డులకు ఎంపిక చేశారు. మనం ఫౌండేషన్ ఛైర్మన్ డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా అవార్డు అందుకున్నట్లు మురళీమోహన్ తెలిపారు. వరదల సమయంలో లంక గ్రామాల్లో విద్యార్థులకు చేసిన సేవలకు, పాత గ్రంథాలయం, స్నేహితుల సంఘం స్థాపించి పుస్తకాలు, ఫర్నీచర్‌ను రెండు గ్రంథాలయాలకు గుంటూరులో అందజేసిన సందర్భంగా, సీపీఎస్ ఉద్యోగులకు చేసిన సేవలకు గుర్తింపు అవార్డు లభించిందన్నారు. ఎం. శ్రీనివాసరావు, బి.బాలకృష్ణ, సుబ్రహ్మణ్యం, వెంకటేశ్వరమ్మ పాల్గొన్నారు.

గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావుకు...


అవార్డు అందుకుంటున్న మోర్ల శ్రీనివాసరావు

పిట్టలవానిపాలెం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక శాఖా గ్రంథాలయాధికారి మోర్ల శ్రీనివాసరావుకు అంతర్జాతీయ మనం ఫౌండేషన్ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లోని త్యాగరాయ కళాక్షేత్రంలో ఫౌండేషన్ ఛైర్మన్ అండ్ ఫౌండర్ డాక్టర్ కె.చక్రవర్తి ఆధ్వర్యంలో భారత సేవారత్న నేషనల్ అవార్డును ముఖ్యఅతిథులు జూబ్లీ ఫాన్‌బాషా చేతులమీదగా అందజేశారు. మోర్ల శ్రీనివాసరావు ఈ అవార్డు అందుకోవటంపై పలువురు ప్రముఖులు, శ్రేయోభిలాషులు, బంధువులు పాఠకులు అభినందనలు తెలిపారు.

మహేష్‌కు డాక్టరేట్

రేపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణానికి చెందిన యెనుముల మహేష్‌కు ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్‌లో పరిశోధనకుగాను రాజస్థాన్ రాష్ట్రం ఆజ్మీర్‌లోని భగవత్ విశ్వవిద్యాలయం పీహెచ్‌డీ పట్టాను అందుకున్నారు. ఈ పరిశోధనకు 2021లో మహేష్ ఆస్ట్రేలియా ప్రభుత్వం నుంచి పేటెంట్ కూడా పొందటం జరిగింది. పరిశోధన ఫలితాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గుర్తింపును తెచ్చింది. ఈ డాక్టరేట్‌ను అందుకున్నందుకు తల్లిదండ్రులైన నెహ్రూ, భవానిలతో పాటు విద్యావేత్తలు, శాస్త్రవేత్తలు, ఉపాధ్యాయులు మహేష్‌ను అభినందించారు.



మహేష్‌కు డాక్టరేట్‌పట్టాను అందిస్తున్న రాజస్థాన్ భగవతివిశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు

నేడు వ్యాస, హిందుమిత్ర పురస్కార ప్రదానోత్సవం

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని విజయలక్ష్మీపురం రోటరీ కల్యాణ మండపంలో ఆదివారం వ్యాస పురస్కారాలు, హిందుమిత్ర పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమం జరుగుతుందని బాపట్ల హిందూ ఉపాధ్యాయ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజయ్ ఫణిశర్మ, జిల్లా అధ్యక్షులు ఎస్.రామ్‌చందు, ఎం.కిరణ్‌కుమార్, వి.ప్రసాద్‌లు తెలియజేశారు.

భార్య అదృశ్యంపై ఫిర్యాదు

బాపట్ల, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని రెల్లికాలనీకి చెందిన యర్రంశెట్టి భవానీ శుక్రవారం వ్యవసాయ కళాశాలలో పనికి వెళుతున్నానని చెప్పి వెళ్ళి తిరిగి రాకపోవటంతో చుట్టుపక్కల విచారించి భర్త యర్రంశెట్టి వీర్రాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు పట్టణ ఎస్‌ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. అదేవిధంగా పట్టణంలోని ఆంధ్రకేసరి నగర్‌కు చెందిన పాలపర్తి సుధారాణి సెంటర్‌కు వెళ్ళి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్ళి తిరిగి రాకపోవటంతో భర్త పాలపర్తిరాజు పట్టణ పోలీసుస్టేషన్‌లో శనివారంఫిర్యాదు చేశాడు. ఈమేరకు ఎస్‌ఐ చంద్రావతి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

శిథిలావస్థలో వంతెనలు... ప్రమాదాలకు నిలయాలు


వెదుళ్ళపల్లి-కంకటపాలెం రోడ్డులో శిథిలావస్థలో ఉన్న పేరలి కాల్వ వంతెన సైడ్‌వాల్

బాపట్ల రూరల్, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : శిథిలావస్థలో వంతెనలు, ప్రమాదకర మలుపులు, అతివేగం వలన ఎన్నో ప్రమాదాలకు కారణమౌతున్నాయి. బాపట్ల మండలం వెదుళ్ళపల్లి-పర్చూరు ఆర్‌అండ్‌బి రహదారిలో పేరలి కాల్వ వంతెన రక్షణ గోడలు పూర్తిగా కూలిపోయి ప్రమాదకరంగా ఉన్నాయి. నిత్యం ఈ మార్గంలో ఆర్టీసీ, కళాశాలలు, పాఠశాలల బస్సులు, లారీలు, ట్రాక్టర్‌లు తిరుగుతూ ఉంటాయి. వాహనాలు అదుపు తప్పి వంతెన పై నుంచి కాల్వలో పడితే పెనుప్రమాదంతోపాటు ఎంతో ప్రాణనష్టం సంభవించవచ్చు. అదేవిధంగా బాపట్ల నుంచి గుంటూరు వెళ్ళే రోడ్డు అత్యంత రద్దీగా ఉండే మార్గం. ఈ రహదారిలో అప్పికట్ల మురుగుకాల్వపై వంతెన శిథిలావస్థకు చేరింది. వేగంగా వచ్చే వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. వంతెనకు మరమ్మతులు చేసి ప్రమాదాలు నివారించాలని వాహనదారులు కోరుతున్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ


సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

భట్టిప్రోలు (కొల్లూరు), జూలై 12 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యానికి గురై చికిత్స పొందిన బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు శనివారం పంపిణీ చేశారు. భట్టిప్రోలు మండలం పెదలంక గ్రామానికి చెందిన వేములపల్లి ఫణిరత్నకిషోర్, చుండూరు మండలం చుండూరుకు చెందిన గొర్రెపాటి వెంకటరెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ ప్రైవేట్ వైద్యశాలలో చికిత్స పొందారు. చికిత్స కోసం అయిన ఖర్చు గురించి ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా ఆయన సీఎంఆర్‌ఎఫ్ కార్యాలయానికి సిఫారసు చేశారు. కార్యాలయం నుంచి రత్నకిషోర్‌కు రూ.5,84,682, వెంకటరెడ్డికి రూ.1,69,417 చెక్కుల రూపంలో మంజూరు అయ్యాయి. ఆయా చెక్కులను గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. బాధిత కుటుంబ సభ్యులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఎమ్మెల్యే ఆనందబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

వెల్లటూరు ఛానల్ అక్విడెక్ట్ పనులు పరిశీలన

కొల్లూరు, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వెల్లటూరు ఛానల్ అక్విడెక్ట్ పనులను రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు శివప్రసాద్, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ పంతాని మురళీధరరావులు శనివారం పరిశీలించారు. భట్టిప్రోలు సమీపంలో గత ఖరీఫ్ సీజన్‌లో వెల్లటూరు ఛానల్ అక్విడెక్ట్ విరిగిపోవడంతో రూ.10.75 కోట్ల అంచనా వ్యయంతో నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆయా పనులను పరిశీలించిన మంత్రి సోదరుడు మాట్లాడుతూ, రేపల్లె నియోజకవర్గంలో నగరం, నిజాంపట్నం, చెరుకుపల్లి, వేమూరు నియోజకవర్గంలో భట్టిప్రోలు మండలంలోని గ్రామాలకు ఛానల్ ద్వారా రైతులకు సాగు నీరు అందుతుందన్నారు. అక్విడెక్ట్ నిర్మాణ పనులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ త్వరితగతిన పూర్తయ్యేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు సాగునీటి ఇబ్బందులు లేకుండా పనులను పూర్తి చేసి సాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. పరిశీలనలో టీడీపీ నాయకులు, ఇరిగేషన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


భట్టిప్రోలు వద్ద అక్విడెక్ట్ పనులు పరిశీలిస్తున్న మంత్రి అనగాని సోదరుడు శివప్రసాద్, కేడబ్ల్యూడీసీ ఛైర్మన్ మురళీధరరావు

హామీల అమలులో ప్రభుత్వం విఫలం : సీపీఐ

రేపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలం చెందాయని సీపీఐ రేపల్లె ఏరియా కార్యదర్శి గొట్టుముక్కల బాలాజీ ఆరోపించారు. నిజాంపట్నం మండలం బొర్రావారిపాలెంలో శనివారం సీపీఐ శాఖ 13వ శాఖ మహాసభ జరిగింది. ఆయన మాట్లాడుతూ మూడవసారి అధికారంలోకి వచ్చిన నరేంద్రమోదీ కార్మికులు సాధించుకున్న చట్టాలను కాలరాస్తూ కార్పొరేట్‌కంపెనీలకు అనుకూలంగా నాలుగు లేబర్‌కోడ్స్‌ను తీసుకువచ్చారని ఆయన తెలిపారు. కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు 3 సెంట్ల ఇంటిస్థలం ఇస్తామని హామీనిచ్చారని, విద్యుత్ చార్జీలు పెంచమని వాగ్దానం చేసిన చంద్రబాబునాయుడు సంవత్సర కాలంలో సర్దుబాటు చార్జీల పేరుతో రూ.15,485 కోట్ల భారాన్ని మోపారన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి బొర్రా నాగమల్లేశ్వరరావు, నాయకులు బండారు శ్రీనివారావు, డి.వెంకటస్వామి, ఎన్.శ్రీనివాసరావు, కె.జయమ్మ, పున్నమ్మ, నాగమణి పాల్గొన్నారు.

లీలావేణుగోపాలశర్మకు వైదిక జ్ఞాననిధి బిరుదు


లీలావేణుగోపాలశర్మను సన్మానిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

నగరం, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : వ్యాసపౌర్ణమి, గురుపౌర్ణమిని పురస్కరించుకుని సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ధూళిపూడిలో వ్యాసపూజ నిర్వహించారు. అనంతరం వైదికజ్ఞాననిధి బిరుదుతో జానపాటి లీలావేణుగోపాలశర్మని ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏకరాశిగా ఉన్న వేదాలను విభజించి గ్రంథస్థం చేసి, అష్టాదశ పురాణాలు ఉపపురాణాలు ఉపనిషత్తులు మహాభాగవతం గ్రంథాలు మన హిందూ ధర్మానికి అందించిన వ్యాసమహాముని మనకి ఆదిగురువని, అదేవిధంగా ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మాధ్వాచార్యులు, దత్తాత్రేయ, గురుదత్త వీరందరిని కూడా మనం పూజించి స్మరించుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ, పరియోజన ప్రముఖ్ పడమట వెంకటేశ్వరరావు, ఉల్లంగుంట శివరామకృష్ణ, ధర్మప్రచారక్‌లు జంజనం హేమశంకరరావు, చింతల మురళీకృష్ణ, కొమ్మూరి పద్మజ, రాచాబత్తిని రామారావు పాల్గొన్నారు.

కైతేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా లక్ష్మోజీ

రేపల్లె, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : రైతులకు అండగా నిలిచి వారి సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం రేపల్లె మండలం కైతేపల్లి పీఏసీఎస్ సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నికైన వడ్డే లక్ష్మోజీ, పీఏసీఎస్ సభ్యులు బోగాది అరవింద్, బండ్రెడ్డి శ్రీనివాసరావులను ఆయన శాలువాకప్పి అభినందించారు. ఈ సందర్భంగా లక్ష్మోజీ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మంత్రి అనగాని సత్యప్రసాద్ కైతేపల్లి సొసైటీ అధ్యక్షుడిగా ఎన్నుకోవటంతో ఆయనకు రుణపడి ఉంటానని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. రైతులకు అందుబాటులో ఉంటూ వారికి కావాల్సిన ఎరువులను సకాలంలో అందిస్తూ రుణసదుపాయాలను సమకూరుస్తూ అండగా నిలుస్తామన్నారు. అనగాని శివప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని ఇచ్చి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పంతాని సాయికుమార్, దేవగిరి రవి పాల్గొన్నారు.


వడ్డే లక్ష్మోజీని అభినందిస్తున్న మంత్రి సోదరుడు అనగాని శివప్రసాద్

శిఖరేశ్వరస్వామి ఆలయంలో ముగిసిన మండలారాధన

చెరుకుపల్లి, జూలై 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నడింపల్లి శిఖరేశ్వరస్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ తరువాత మండలారాధన శనివారంతో ముగిసింది. ఆలయంలో మండల పూజా కార్యక్రమంలో స్వామివారికి అభిషేకం, హోమాలు మామిళ్లపల్లి మణిపూర్ణశర్మ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ కార్యక్రమం నిర్వహించారు. ఈ అన్నసంతర్పణ కార్యక్రమానికి సుమారు 1500 మంది విచ్చేశారని ఆలయ నిర్వాహకులు తెలిపారు.